సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 15 । మార్చి । 2024



అడవుల సంరక్షణ అందరి బాధ్యత 10లో

అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని సబ్ డీఎఫ్‌వో శ్రీరామారావు సూచించారు.



ముగిసిన సుంకు జాతర

ఎటపాక: మండలంలోని నల్లకుంట గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న సుంకు జాతర గురువారం ఘనంగా ముగిసింది.



ఆలయానికి శంకుస్థాపన

పాడేరు : నూకురువుట్టులో సూర్యనారాయణస్వామి ఆలయ నిర్మాణానికి అరకు ఎంపీ మాధవి శంకుస్థాపన చేశారు.

న్యూస్‌రీల్

119 మంది సీఆర్టీల క్రమబద్ధీకరణ

- నియామక పత్రాలు అందజేత



స్కూల్ అసిస్టెంట్‌కు నియామకం పత్రం అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీలుగా పనిచేస్తున్న మరో 119 మందిని రెండో విడతలో క్రమబద్ధీకరించామని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నియమాకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ త్వరలో పీఈటీలు, పీడీలు, తెలుగు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామన్నారు. ఈనెల 13 నుంచి 15 వరకు హిందీ పండితులకు పదోన్నతులు ఇస్తామని చెప్పారు. రెగ్యులర్ అయిన సీఆర్టీలంతా గిరిజన విద్యార్థులకు అత్యుత్తమ విద్య బోధన చేయాలని సూచించారు.సీ కార్యక్రమంలో టీడబ్ల్యూ డీడీ కొండలరావు పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏలో జగనన్నకు చెబుదాం స్పందన

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏలో శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం యాథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై వినతులు ఇవ్వాలని ఆమె కోరారు.అలాగే అన్నిశాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకే పాడేరు ఐటీడీఏకు చేరుకోవాలని ఆమె ఆదేశించారు.

బియ్యం అక్రమ నిల్వలపై కేసు నమోదు

చింతూరు: మండలంలోని గంగన్నమెట్టలో ఇటీవల పట్టుబడిన 256 బస్తాల బియ్యం నిల్వకు సంబంధించి ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశాల మేరకు 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ నజీముల్లాషా గురువారం తెలిపారు. పట్టుబడిన 10.77 టన్నుల బియ్యం తెలంగాణకు చెందిన రేషన్ బియ్యంగా గుర్తించామని ఆయన పేర్కొన్నారు. పీవో ఆదేశాల మేరకు పట్టుబడిన బియ్యానికి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశామన్నారు.

రాష్ట్ర సరిహద్దులో ఇసుక లారీల నిలిపివేత



పోలీసులు నిలిపిన ఇసుక లారీలు

ఎటపాక: ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో ఆంధ్రా పోలీసులు 15 ఇసుక లారీలను నిలిపివేశారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం తూరుబాకలోని గోదావరి ర్యాంపు నుంచి ఆంధ్రాలోని ఎటపాక మీదుగా తెలంగాణలోని హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న లారీలను అడ్డుకున్నారు. ఇసుక తరలింపునకు అనుమతి ఉందా లేదా అనే కోణంలో విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ రామారావు తెలిపారు.

తుపాకీ స్వాధీనం.. ఇరువురిపై కేసు

రాజవొమ్మంగి: రక్షిత అటవీప్రాంతంలో సంచరిస్తున్న ఇరువురి నుంచి తుపాకీ (పాయింట్ 22 గన్)ని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని రాజవొమ్మంగి అటవీక్షేత్రాధికారి సయ్యద్ సెహన్నా తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. రాజవొమ్మంగి ఫారెస్ట్ రేంజ్‌లోని గొంటువానిపాలెం బీట్‌లో తుపాకీతో కొంతమంది సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. వారు వెంటనే అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ప్రత్తిపాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద ఉన్న తుపాకీని పొదల్లోకి విసిరేసి పరారయ్యేందుకు ప్రయత్నించారన్నారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి వివరాలు తెలుసుకుని, తుపాకీని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దాడిలో పాల్గొన్న బీట్ ఆఫీసర్ రామకృష్ణ, సెక్షన్ ఆఫీసర్ బాలాజీ, ముగ్గురు బేస్‌క్యాంపు సిబ్బందిని ఆయన అభినందించారు.

టీడీపీలో సెగలు

- సీటు రాకపోవడంపై సీనియర్లు గరం గరం
- భోరుమంటున్న బండారు, ఇంటికే పరిమితం
- ఎన్నికల బరిలో ఉంటానంటున్న ప్రగడ
- రాజీనామా చేస్తున్నట్టు గండి బాబ్జీ లీకులు
- ముఖం చాటేస్తున్న అనకాపల్లి టీడీపీ నేతలు
- భవిష్యత్ కార్యాచరణపై అనుచరులతో సమావేశమైన గంటా
- నేడు బలప్రదర్శనకు గిడ్డి ఈశ్వరి సన్నాహాలు
- మాడుగులలో పి.వి.జి.కుమార్, గవిరెడ్డి మండిపాటు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

టికెట్ల ప్రకటనపై టీడీపీలో నిరసన సెగలు ఎగసిపడుతున్నాయి. అసంతృప్తి నేతలూ తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. అధినేత తీరుపై ధ్వజమెత్తుతున్నారు. చంద్రబాబు తమను నమ్మించి గొంతుకోశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొత్తు నేపథ్యంలో పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన తమను కాదని ఆ సీట్లను బీజేపీ, జనసేనకు కేటాయించడంపై వారు ప్రశ్నిస్తున్నారు. విశాఖ దక్షిణం, ఉత్తరం, పెందుర్తి, యలమంచిలి, అనకాపల్లి, పాడేరు నియోజకవర్గాల్లోని టీడీపీ నేతలు అధినేత చంద్రబాబు వ్యవహారశైలిపై మండిపడుతున్నారు. కేవలం ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే ఏకంగా పొత్తులో ఆరు సీట్లను కేటాయించడం ఏమిటని వాపోతున్నారు. పార్టీ అధినేత వ్యవహారశైలిపై బండారు భోరుమంటుండగా... బాబ్జీ తన సీటుకు 'గండి'పడటంపై మండిపడుతున్నారు. ఏకంగా పార్టీకి రాజీనామా చేస్తున్నారనే వదంతులు వెలువడ్డాయి. ఇక గంటాకు భీమిలి ఇచ్చేది లేదు.. చీపురుపల్లి వెళ్లాలని హుకుం జారీ చేయడంతో.. తన సీటు కోసం చంద్రబాబు మెడలో గంట కట్టేందుకు నారాయణ....నారాయణ అని తిరుగుతున్నారు. **తాజాగా తన అనుచరులతో భవిష్యత్తు కార్యాచరణపై గంటా భేటీ అయ్యారు. ఇక యలమంచిలిలో ఇప్పటికే పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్ విరిగిపోగా.. అనకాపల్లిలో లోలోపల అగ్గిరాజుకుంటోంది. మరోవైపు ఏజెన్సీలోని పాడేరు నియోజకవర్గాన్ని బీజేపీకి ఇవ్వడం** ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి. మొత్తంగా తెలుగుదేశం పార్టీని విశాఖ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

నమ్ముకుంటే నట్టేట ముంచారు...!

వాస్తవానికి గత ఎన్నికల్లో నగరంలో నాలుగు సీట్లనూ తెలుగుదేశం పార్టీ గెలుపొందింది. ఇప్పుడు పొత్తులో భాగంగా ఇందులో రెండు సీట్లను జనసేన, బీజేపీకి కేటాయించారు. పార్టీకి దక్షిణ నియోజకవర్గంలో ఎవరూ దిక్కు లేని సమయంలో తనకు పగ్గాలు అప్పగించి.. తీరా ఎన్నికల ముందు జనసేనకు ఇవ్వడాన్ని గండి బాబ్జీ జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక విశాఖ ఉత్తరాన్ని గతంలో ఎమ్మెల్యేగా ఉన్న విష్ణుకుమార్‌రాజు పార్టీ నేతలను ఇబ్బంది పెట్టిన విషయాన్ని పదే పదే గుర్తుచేసినా.. తిరిగి ఆయనకే సీటు ఇవ్వడం ఏమిటని టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఇక పెందుర్తిలో సీనియర్ నేత బండారు సత్యనారాయణను కనీసం



పట్టించుకోకపోవడాన్ని ఆయన వర్గీయులు తప్పు పడుతున్నారు. మొదటి నుంచీ పార్టీలో ఉన్న సీనియర్ నేతను గౌరవించే పద్ధతి ఇదేనా అని వాపోతున్నారు. యలమంచిలిలో పార్టీ జెండాను ఎవరూ మోసేందుకు సిద్ధంగా లేని పరిస్థితుల్లో అండగా ఉన్న ప్రగడ నాగేశ్వరరావును కనీసం సంప్రదించకుండా జనసేనకు సీటును కేటాయించారు. అనకాపల్లిలో గ్రామగ్రామాన పార్టీ కార్యక్రమాలను నిర్వహించిన పీలా గోవింద్‌ను కనీసం పట్టించుకోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాడేరులోనూ గిడ్డి ఈశ్వరి.... పార్టీ మారివచ్చినందుకు తనకు మంచిగా గడ్డి పెడుతున్నారని వాపోతున్నారు. ఇలా నేతలందరూ పార్టీని నమ్ముకుంటే చంద్రబాబు నట్టేట ముంచారని వాపోతున్నారు.

అన్ని చోట్లా అదే తీరు..!

- తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారిని, నమ్ముకున్న వారిని నట్టేట ముంచారంటూ చంద్రబాబు వైఖరిపై మండిపడుతున్నారు.
- ఇప్పటికే గండి బాబ్జీ రాజీనామా అస్త్రాన్ని ఎక్కుపెట్టినట్టు తెలుస్తోంది. తనకు ఎక్కడో ఒక చోట సీటు ఇవ్వకపోతే తెలుగుదేశం పార్టీలో కొనసాగేదిలేదని ఆయన అనుచరులతో స్పష్టం చేసినట్టు సమాచారం.
- గంటా శ్రీనివాసరావు కూడా తన అనుచరులతో సమావేశమై... భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. చీపురుపల్లి నుంచి పోటీ చేసేదిలేదని... భీమిలి ఇస్తే ఓకే లేదంటే ఏమి చేద్దామనే అంశంపై అనుచరుల అభిప్రాయాలను సేకరించినట్టు తెలుస్తోంది.
- విశాఖ ఉత్తరంలో బీజేపీ నుంచి పోటీ చేయనున్న విష్ణుకుమార్‌రాజుకు టీడీపీ కేడర్ ఎక్కడా సహకరించడం లేదు.
- పెందుర్తిలో బండారు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇంటిపట్టునే ఉండి కనీసం బయటకు వచ్చి మోహం చూపించేందుకు కూడా ఆయన ఇష్టపడలేనంతగా లోలోపల రగిలిపోతున్నట్టు తెలుస్తోంది.
- యలమంచిలిలో జనసేన నుంచి పోటీలో ఉండనున్న సుందరపు విజయకుమార్ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావును కలవగా.. మద్దతిచ్చేది లేదని, తానూ బరిలో ఉంటానని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది.
- అనకాపల్లిలో కొణతాలపై లోలోపల కత్తులు నూరుతున్నారు. పీలా వర్గీయులతో పాటు దాడి వర్గీయులు కూడా కొణతాలకు సహకరించేది లేదని పేర్కొంటున్నారు.
- మాడుగుల టీడీపీ ఇన్‌చార్జి పి.వి.జి.కుమార్ కె.కోటపాడులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై అసంతృప్తిని వ్యక్తం చేశారు. తనకు సీటు రాకపోవడంపై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చీడికాడలో పార్టీ నేతలతో సమావేశమై ఇన్నాళ్లూ పార్టీ కోసం కష్టపడితే అధినేత భలే బుద్ధిచెప్పారని వాపోయారు.
- ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ గతంలో ఎన్నడూలేనివిధంగా టీడీపీలో అసంతృప్తి సెగలు కమ్ముకుంటున్నాయి. రానున్న రోజుల్లో ఎండవేడిమికి మించి ఈ సెగలు పెరిగి.. పార్టీలో అగ్గిరాజేసి విజయావకాశాలను నిలువునా కాల్చేసే పరిస్థితులున్నాయని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు.

అమీతుమీ తేల్చుకుంటాం

- టీడీపీ అధిష్టానానికి ఆ పార్టీ శ్రేణుల హెచ్చరిక
- రంపచోడవరం టికెట్ శిరీషా దేవికి కేటాయింపుపై ధ్వజం
- రోడ్డుపైకి వచ్చి నిరసన
- పునరాలోచించకుంటే మాకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని స్పష్టీకరణ
- నేడు వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో విజయవాడ వెళ్లాలని నిర్ణయం



రంపచోడవరంలో టీడీపీ టికెట్ వంతల రాజేశ్వరికి ఇవ్వకపోవడంతో ఆందోళన చేస్తున్న పార్టీ నేతలు

రంపచోడవరం : రంపచోడవరం టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మిరియాల శిరీషా దేవి పేరు ప్రకటించడంతో టీడీపీ నాయకుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కాకుండా పైరవీలు చేసిన వారికి టికెట్ ఇవ్వడం అన్యాయమని వారంతా ధ్వజమెత్తారు. రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. ఆ పార్టీ అధిష్టానంతో అమీతుమీ తేల్చుకునేందుకు వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ వెళ్లేందుకు వారు సిద్ధమవుతున్నారు.

వంతల ఇంటి వద్ద సమావేశం: టీడీపీ టికెట్ శిరీషాదేవికి ప్రకటించిన నేపథ్యంలో గురువారం రంపచోడవరంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి నివాసంలో ఏజెన్సీలోని టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. అనంతరం వారు రాజేశ్వరికి టీడీపీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఎవరిని సంప్రదించకుండా శిరీషా దేవికి ఎలా టికెట్ ఇచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలో ఐదేళ్లపాటు కష్టపడి పనిచేసిన వంతల రాజేశ్వరికి టికెట్ ఇవ్వకపోతే పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని వారు హెచ్చరించారు.

మాజీ ఎంపీ పెత్తనమేంటి?

అభ్యర్థి ఎంపికలో టీడీపీతో సంబంధం లేని ఒక మాజీ ఎంపీ పెత్తనమేంటని టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. టీడీపీలో కష్టపడి పనిచేసిన వారికి న్యాయం జరగదు అనడానికి ఈ పరిణామమే ఒక ఉదాహరణ అని ఆవేదన వ్యక్తం చేశారు. మిరియాల శిరిషాదేవి టికెట్ విషయంలో మార్పు లేకపోతే పార్టీ కోసం పనిచేసేది లేదని వారు బహిరంగంగా చెబుతున్నారు. టికెట్ విషయంలో పునరాలోచన చేయాలని లేకపోతే పార్టీ పదవులకు మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అభ్యర్థి ఎంపిక విషయంలో పునరాలోచించకుంటే అమీతుమీ తేల్చుకుంటామని వారు ప్రకటించారు.

శిరీషా దేవి ఫ్లెక్సీల ధ్వంసం

రంపచోడవరం టీడీపీ అభ్యర్థిగా మిరియాల శిరీషా దేవి పేరును టీడీపీ అధిష్టానం ప్రకటించిన వెంటనే మధ్యాహ్నం రంపచోడవరం నుంచి గెద్దాడ వరకు ఉన్న ఆమె ఫ్లెక్సీలను చింపేశారు. టికెట్‌కోసం టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్ చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో వారంతా స్తబ్ధతగా ఉన్నారు.

టీడీపీ అధిష్టానంపై మాజీ ఎమ్మెల్యే 'గిడ్డి' గుర్రు

పాడేరు : పాడేరు అసెంబ్లీ టికెట్‌ను దాదాపుగా బీజేపీ కేటాయిస్తూ టీడీపీ అధిష్టానం నిర్ణయం తీసుకోనుండటంతో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి ఝలక్ ఇచ్చినట్టయింది. ఈ నేపథ్యంలో అధిష్టానం తీరుపై గుర్రుగా ఉన్న ఆమె గురువారం పాడేరు పట్టణంలోని కుమ్మరిపుట్టు వద్ద తన నివాసంలో అనుచరులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇరవై ఏళ్లుగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే పదవి టీడీపీకి లేకపోయినా పార్టీ పటిష్టతకు కృషి చేస్తే ఈసారి ఎన్నికల్లో పొత్తుల్లో బీజేపీకి కేటాయిస్తామనడం సరికాదని పలువురు పేర్కొన్నారు. టీడీపీకి టికెట్ కేటాయించకుంటే ఓట్లన్నీ వైఎస్సార్‌సీపీకే పడతాయన్నారు. ఈ పరిస్థితుల్లో టికెట్ కేటాయించకుంటే రెబల్ అభ్యర్థిగా బరిలో నిలవాలని వారు గిడ్డి ఈశ్వరికి సూచించారు.

నేడు బల ప్రదర్శన?: పాడేరులో ఈనెల 15న తన అనుచరులతో బల ప్రదర్శన నిర్వహించి అధిష్టానానికి తన సత్తా చూపాలన్న లక్ష్యంతో గిడ్డి ఈశ్వరి సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఆమె కార్యాచరణ కూడా ప్రకటించే అవకాశం ఉండవచ్చు.

ఈబీసీ నేస్తంతో 576 మందికి లబ్ధి

- వారి ఖాతాల్లో రూ.86.40 లక్షలు జమ
- కలెక్టర్ విజయ సునీత



లబ్ధిదారులకు నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: ఈబీసీ నేస్తం పథకంలో జిల్లాలోని 576 మందికి రూ.86.40 లక్షల మేర లబ్ధి చేకూరిందని కలెక్టర్ విజయ సునీత తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో ఈబీసీ నేస్తం సాయాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు.అనంతరం నమూనా చెక్కును కలెక్టర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఈబీసీలో 45నుంచి 60ఏళ్ల వయసు లోపు ఉన్న మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.2021–22 నుంచి ఈపథకం ప్రారంభమైందని, తొలి విడతలో 21మందికి రూ.3.15 లక్షలు,రెండవ విడతలో 618 మందికి రూ.92.70లక్షలు, ప్రస్తుతం మూడవ విడతలో 576మందికి రూ.86.40 లక్షలను ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఆర్యవైశ్య ,ఈబీసీ కమ్మ, క్షత్రియ,రెడ్డి కార్పొరేషన్ల ద్వారా ఆయా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, బీసీ కార్పొరేషన్ ఏఈవో కె.శంకర్, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీకేవీధిలో 18న జాబ్‌మేళా

గూడెంకొత్తవీధి: ఈనెల 18న జీకేవీధిలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. పదోతరగతి అంతకు మించి చదువుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న రంగంలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణతోపాటు ఉపకార వేతనం, ఇచ్చి అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. ఉన్నతి పథకంలో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 6304800654 నంబరులో సంప్రదించాలని కోరారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

తాత్కాలిక షాపుల ఏర్పాటుకు 18న బహిరంగ వేలం

ఎటపాక: మండలంలోని వెంకటరెడ్డిపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 13న జరగాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల ఈనెల 18కు వాయిదా వేసినట్టు దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు గురువారం తెలిపారు. వేలంను అదేరోజు ఉదయం 11గంటలకు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఈనెల 25న స్వామి వారి తిరుకల్యాణమహోత్సవం సందర్భంగా 24 నుంచి 26 వరకు ఆలయం వద్ద కొబ్బరి కాయల విక్రయం, కొబ్బరి చిప్పలు, తలనీలాలు పోగు చేసుకునేందుకు, లడ్డూ, పులిహోర ప్రసాద విక్రయాల నిమిత్తం తాత్కాలిక దుకాణాలు వేసుకునేందుకు ఈవేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని వారు కోరారు.

18 నుంచి టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి,పాడేరు: టెన్త్ పరీక్షలు ఈనెల 18 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 22 మండలాల పరిధిలో 65 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు ఆయన వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. పరీక్షలకు 634 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 12,051మంది పరీక్షలు రాయనున్నారు. వీరిలో 10,986 మంది రెగ్యులర్, 1065 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు రోజువారీ పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రణాళికపరంగా చర్యలు చేపట్టామని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు తెలిపారు.

ఆఫ్‌లైన్ విధానంలో రేషన్ పొందవచ్చు

- జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

సాక్షి,పాడేరు: జిల్లాలోని 256 రేషన్ డిపోల ద్వారా ఆన్‌లైన్‌లో నిత్యావసర సరకులు పొందలేని రేషన్ కార్డుదారులు ఆఫ్‌లైన్ విధానంలో పొందవచ్చని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ తెలిపారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్ విధానంలోకి నిత్యావసరాల పంపిణీ మార్చామన్నారు. అయితే గ్రామాల్లో నెట్‌వర్క్, సిగ్నల్ సమస్యల కారణంగా ఈపోస్ యంత్రాలు పనిచేయడం లేదన్నారు. దీనివల్ల ప్రజలనుంచి వచ్చిన వినతులను కలెక్టర్ విజయ సునీతతో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం ఆఫ్‌లైన్ విధానంలోకి నిత్యావసరాల పంపిణీని మార్చినట్టు పేర్కొన్నారు. ఇంత వరకు నిత్యావసరాలు పొందని ప్రజలు ఈనెల 17 లోగా ఆఫ్‌లైన్‌లో పొందాలని సూచించారు. ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ దుకాణాల నిర్వాహకులంతా పంపిణీని వేగవంతం చేయాలని జేసీ ఆదేశించారు.

చర్మవ్యాధుల నివారణకు ప్రత్యేక వైద్య శిబిరాలు

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో, ఆస్పత్రి సూపరిండెంట్, వైద్యులు

సాక్షి,పాడేరు: చర్మవ్యాధుల నివారణకు సత్వర వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా అన్నారు. మండలంలోని కందమామిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, వైద్య నిపుణుడు ఎర్రయ్య తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఐటీడీఏ పీవో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, హెచ్ఎం,ఉపాధ్యాయులు,మినుములూరు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై అపోహలు వద్దు

- ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్ విజయ సునీత



పెదగూడలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ విజయ సునీత

ముంచంగిపుట్టు: ఈవీఎంలలో ఓటు వినియోగంపై ఎటువంటి అపోహలు వద్దని కలెక్టర్ విజయ సునీత అన్నారు. మండలంలోని పెదగూడలో ఈవీఎం ద్వారా ఓటు వేయడంపై ఓటర్లకు అర్థమయ్యే రీతిలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఓటు వేసే విధానాన్ని గిరిజనులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరుగా ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన 18 రకాల కార్డులలో ఏ ఒక్క గుర్తింపుకార్డుతోనైనా ఓటు హక్కు వినియోగించుకోవచ్చునన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా సౌకర్యం కల్పించి పోలింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ రఫీ జాన్, ఏపీఎం దేవమంగ, ఆర్ఐ రవికుమార్, సర్పంచ్ బాబూరావు, ఎంపీటీసీ గణపతి పాల్గొన్నారు.

పెదబయలు: అర్హులంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయ సునీత కోరారు. గురువారం స్థానిక అంబేడ్కర్ పార్కు ఆవరణలో ఈవీఎంల ద్వారా ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందికి ఆమె సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ శర్మ, మండల అధికారులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. ఎంపీ లాడ్స్ నిధులు రూ.10లక్షలతో పాడేరు పట్టణంలోని 22 ప్రధాన కూడళ్లలో 52 సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. వీటిని గురువారం పాడేరు సీఐ కార్యాలయంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎస్పీ తుహిన్ సిన్హా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవి మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో పోలీస్ శాఖ పర్యవేక్షణలో జిల్లా కేంద్రంలో ప్రజలు భద్రంగా, సురక్షితంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. ఏదైనా సంఘటనలు జరిగితే నేరస్తులను సులువుగా గుర్తించవచ్చన్నారు. త్వరలో ఎంపీ లాడ్స్ నిధుల నుంచి ఏజెన్సీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన అరకు, చింతపల్లి, కొయ్యూరులో కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏఎస్పీ ధీరజ్, పాడేరు సీఐ నవీన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మంగ్లన్నదొర, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి విశ్వ, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సీదరి రాంబాబు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



ద్వాక్రా సంఘ సభ్యులకు వైఎస్సార్ చేయూత చెక్కును అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: ఏజెన్సీలోని ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ చేయూతను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు)లు అన్నారు. రంపచోడవరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. దేవీపట్నం, మారేడుమిల్లి, రంపచోడవరం మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ప్రభుత్వం ద్వాక్రా సంఘ మహిళలకు ఏటా రూ.17,500 చొప్పున నాలుగు విడతల్లో సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసిందన్నారు. మహిళల పేర్లతో ఇంటి పట్టాలు మంజూరు చేసి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. 11 మండలాల్లో ద్వాక్రా సంఘ సభ్యులకు సంబంధించిన రూ. 80 కోట్ల అప్పును ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు.సున్నా వడ్డీ పథకం ద్వారా రూ. 30 కోట్లు ఇచ్చిందని చెప్పారు. పింఛన్‌ను రూ.3వేలకు పెంచిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఒకటో తేదీన పింఛన్లతో పాటు ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకు వచ్చాయన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చామన్నారు. రంపచోడవరంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పార్టీ పరిశీలకులు కర్రి పాపారాయుడు, ఎంపీపీలు బందం శ్రీదేవి, కుంజం మురళి, సార్ల లలిత, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, కాపారపు రూతు, పండా రామకృష్ణదొర పాల్గొన్నారు.

బూత్ కమిటీలే కీలకం

- వైఎస్సార్‌సీపీకే ఓటు అడిగే హక్కు



బూత్‌కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

నక్కపల్లి: త్వరలో జరిగే ఎన్నికల్లో బూత్‌కమిటీ సభ్యులే కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయించే బాధ్యతను మీరే తీసుకోవాలని శాసన మండలిలో ప్రభుత్వ విప్, నియోజకవర్గ పరిశీలకురాలు వరుదు కల్యాణి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, పార్టీజిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌లు అన్నారు. గురువారం నక్కపల్లి సుబ్బారామిరెడ్డి కల్యాణమండపంలో మండలంలో బూత్‌కమిటీలు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ఓటు అడిగే అర్హత, హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. ఇటువంటి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని చూసి ప్రతి కార్యకర్త గర్వపడాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని చెప్పారు. సంక్షేమ పథకాల వల్ల సగటున ప్రతి కుటుంబం సుమారు రూ.3 నుంచి 5లక్షల వరకు లబ్ధి పొందిందన్నారు. కరోనా సంక్షోభం వచ్చినా, ప్రతిపక్ష తెలుగు దేశం పార్టీ కోర్టులను ఆశ్రయించి పథకాలను అడ్డుకోవాలని ప్రయత్నించినా, ఇతర ఎన్ని ఇబ్బందులు వచ్చినా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని తెలియడంతో టీడీపీ అధినేత చంద్రబాబు బీజేపీ, జనసేనలతో పొత్తుపెట్టుకుని వారు అడిగనన్ని సీట్లు కేటాయిస్తున్నారన్నారు. నలభైఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో గెలవలేమనే భయం వెంటాడుతోందన్నారు. ప్రతి బూత్‌కమిటీ సభ్యుడు ఓటర్లను స్వయంగా కలిసి జగనన్న వల్ల జరిగిన లబ్ధిని వివరించి ఓటువేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారయణరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు శీరంనర్సింహమూర్తి పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పాపారావు, తాతబాబు, జేసీఎస్ కన్వీనర్ ఎస్. గోవిందు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కె.హరి, సర్పంచ్‌లు రత్నకుమారి, సురేష్‌వర్మ,బార్గవ్, శ్రీను,అప్పలరాజు, నర్సింహమూర్తి, రమణ,రాజబాబు, ఎంపీటీసీలు గోవిందు, తిరుపతిరావు, కాసుబాబు, బొల్లం బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు నాటు తుపాకీ అప్పగింత



పోలీసులకు బుచ్చిబాబు అప్పగించిన నాటు తుపాకీ

కొయ్యూరు: డొనూరు పంచాయతీ బచింతకు చెందిన పాంగి బుచ్చిబాబు అతని వద్ద ఉన్న నాటు తుపాకీని గురువారం కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్ఐ రామకృష్ణకు అప్పగించారు. అనుమతి లేని నాటు తుపాకులను అప్పగించాలని రెండు రోజులుగా పోలీసులు చేస్తున్న ప్రకటనకు బుచ్చిబాబు నాటు తుపాకీని పోలీసులకు అప్పగించారు. ఎవరి వద్ద నాటు తుపాకులు, లైసెన్స్ లేని ఆయుధాలు ఉంటే పోలీసు స్టేషన్‌లో అందజేయాలని సీఐ వెంకటరమణ చెప్పారు.

సారాతో ఒకరి అరెస్టు



సారాతో పట్టుపడిన వ్యక్తితో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది

జి.మాడుగుల: సొలభం జంక్షన్ వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా 10లీటర్లు సారా పట్టుబడినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సొలభం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఒక క్యాన్ వదిలి పారిపోతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నట్టుగా ఆయన చెప్పారు. సొలభం పంచాయతీ మలకర్రలతొగు గ్రామానికి చెందిన వంతాల వెంకటరావుగా విచారణలో తేలిందన్నారు. సారా స్వాధీనం చేసుకొని వెంకటరావును అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆరోగ్య ఆసరాపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్యమిత్ర సర్వేశ్వరరావు

కూనవరం: ఆస్పత్రుల్లో కాన్పుల కోసం వచ్చే వారికి ఆరోగ్యశ్రీ పథకం అమలు జరిగేందుకు ఆన్‌లైన్ విధానం చేపట్టాలని చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ డేవిడ్ ఆదేశాలు ఇచ్చారని స్థానిక ఆరోగ్య మిత్ర డి.సర్వేశ్వరరావు తెలిపారు. నాలుగు మండలాల్లోని పీహెచ్‌సీ వైద్యులు, స్టాఫ్ నర్సులకు గురువారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్పుల కోసం ఆస్పత్రులకు వచ్చే వారి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయడం వల్ల లబ్ధిదారులకు ఆరోగ్య ఆసరా ద్వారా రూ.5000 ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆయా పీహెచ్‌సీ కూడా రూ8000 లబ్ధి వస్తుందన్నారు. కావునా ఆరోగ్య ఆసరా అన్ని పీహెచ్‌సీలలో అమలు జరిగేందుకు కృషి యాలని కోరారు. కూనవరం, కూటూరు, నెల్లిపాక, గొరిదేవిపేట, రేఖపల్లి, జీడిగుప్ప వైద్యాధికారులు సునీల్ కుమార్, ప్రత్యూష, దేవినాగ్, ప్రజ్ఞ, సూర్య, సూపర్ వైజర్లు డీ.శ్రీనివాస్, సీతమ్మ, పున్నమ్మ, ఆరోగ్యశ్రీ సిబ్బంది శాసిని, స్టాఫ్ నర్సులు అప్పాయమ్మ, దివ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పీబీ పురం ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ



పాఠశాలలో తనిఖీ చేస్తున్న సోషల్ ఆడిట్ పరిశీలకురాలు

పాయకరావుపేట: పాఠశాలల సామాజిక తనిఖీ (సోషల్ అడిట్)లో భాగంగా సమగ్ర శిక్ష తరఫున రాష్ట్ర పరిశీలకులు మేఘ మేనాన్ గురువారం పెద రాంభద్రపురం(పీబీ పురం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా పరమైన కార్యక్రమాలు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, టాయిలెట్ల నిర్వహణ, లింగ సమానత్వం, బాలల హక్కులు, బాలల సంరక్షణ, ప్రథమ చికిత్సపై అవగాహన తదితర అంశాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సభ్యులతో విడివిడిగా సమావేశమై వివరాలు సేకరించారు. పాఠశాలలో ఈ కార్యక్రమాల నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అతితక్కువ వనరులతోనే పాఠశాలను అన్ని సౌకర్యాలతో అద్భుతంగా నిర్వహిస్తున్న తీరుకు ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావును, ఉపాధ్యాయ సిబ్బందిని, పేరెంట్స్ కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ మానవెల్లి అప్పారావు, రిసోర్సు పర్సన్ దొర పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు



గంగవరంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం : రంపచోడవరం, చింతూరు డివిజన్‌లో ఈ నెల 18 నుంచి 27 వరకు పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని రంపచోడవరం ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లో 11 మండలాల్లో 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్టుమెంటల్ ఆఫీసర్‌ను నియమించినట్టు చెప్పారు. ఈ 25 పరీక్ష కేంద్రాల్లో 25 మంది సీఎస్‌లు, 25 మంది డివోలను 218 ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. రెండు డివిజన్లల్లో 4770 మంది రెగ్యులర్ విద్యార్థులు, 455 మంది ప్రవేట్ విద్యార్థులు మొత్తం 5225 మంది విద్యార్థులు ఈ పరీక్షలు హాజరవుతున్నట్లు ఆయన వివరించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, పోలీసు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. గంగవరం మండల కేంద్రంలో మరోక కేంద్రాన్ని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఎటువంటి జెరాక్స్ సెంటర్లు తెరవకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఎంఈఓ-3 టి. మల్లేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని కొత్తాడలో కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఐదు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల రంపచోడవరం మండలం నల్లగొండ ఆశ్రమ పాఠశాలలకు చెందిన 320మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు చెప్పారు.హెచ్‌ఎంలు ఝాన్సీహేన్సన్, బాలరాజు, నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా- ఇద్దరికి గాయాలు

పెదబయలు: మండలంలోని గోమంగి పంచాయతీ కరుగొండ ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం కరుగొండ గ్రామం నుంచి పెదబయలు ఆటోలో వస్తుండగా కరుగొండ గ్రామ సమీపంలో ఘాట్‌రోడ్డులో మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ గడుతూరి రాజ్‌కుమార్ కాలు విరిగింది. ప్రయాణికుడు గడుతూరి తిరుపతిరావు తల ఇతర భాగాల్లో గాయాలయ్యాయి. వారిని 108లో స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో మెరిసిన గిరిజన విద్యార్థిని

- ఇంగ్లిష్ సామర్థ్యంలో ప్రథమ బహుమతి
- చీపురుగొంది ప్రభుత్వ పాఠశాల చిన్నారి ప్రతిభ



పోటీల్లో విజేత విద్యార్థిని దీపికతో టీచర్ హనుమంతరావు

ముంచంగిపుట్టు: విద్యార్థుల్లో ఇంగ్లిష్ సామర్థ్యంపై వరల్డ్ పవర్ ఛాంపియన్ 2023-24 పేరుతో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ పాఠశాల గిరిజన విద్యార్థిని మెరిసింది. ముంచంగిపుట్టు మండలం మారుమూల కుమడ పంచాయతీ చీపురుగొంది గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.దీపిక ఉపాధ్యాయుడు హనుమంతరావు ప్రోత్సాహంతో ఇంగ్లిష్‌పై నిర్వహించి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. విజయవాడలో గురువారం విభ లీఫార్వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ బిగ్గెస్ట్ ఇంగ్లిష్ కాంపిటేషన్ ఫర్ రివిజినల్ లీగ్ లాంగ్వేజ్ స్కూల్స్ వరల్డ్ పవర్ ఛాంపియన్ 2023-24 పేరుతో నిర్వహించారు. రాష్ట్రంలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఇంగ్లిష్ భాష స్థాయి తెలుసుకోవడానికి గత కొన్ని రోజులుగా పోటీలు జరిగాయి.వీటిలో ప్రతిభ కనబరించిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంగ్లిష్ భాషపై వివిధ సామర్థ్యాలపై ప్రశ్నలకు అనర్గళంగా 2వ తరగతి విద్యార్థిని దీపిక సామాధానాలు చెప్పి మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదగా విద్యార్థిని దీపిక బహుమతి అందుకుంది. మారుమూల గిరిజన విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవడం పట్ల చీపురుగొంది గ్రామస్తులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని దీపికను విజేతగా నిలపడంతో ఎంతో కృషి చేసిన ఉపాధ్యాయుడు హనుమంతరావును అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరించిన దీపిక వచ్చే నెల ముంబైలో జరిగే నేషనల్ పోటీలకు అర్హత సాధించినట్టు ఉపాధ్యాయుడు హనుమంతరావు తెలిపారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

సబ్ డీఎఫ్ఓ శ్రీ రామారావు




ఎఫ్‌బీవో లక్ష్మిని సత్కరిస్తున్న సబ్ డీఎఫ్‌వో శ్రీరామారావు, రేంజ్ అధికారి సెహెన్‌షా

రాజవొమ్మంగి: రక్షిత అటవీ ప్రాంతంలోని అటవీ సంపద సంరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పని చేయాలని అడ్డతీగల సబ్ డీఎఫ్ఓ శ్రీరామారావు సిబ్బందికి సూచించారు. ఆయన గురువారం స్థానిక అటవీక్షేత్ర కార్యాలయంలో ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, బేస్‌క్యాంపు సిబ్బందితో సమావేశం (ఫారెస్ట్ ప్రొటెక్షన్ మీటింగ్) నిర్వహించి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వన్యప్రాణులు దాహం తీర్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని సూచించారు. వన్యప్రాణుల వేట జరుగకుండా చూడాలని ఆదేశించారు. వేసవిలో అడవుల్లో ఏర్పడే కార్చిచ్చులు వ్యాప్తి చెందకుండా ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. బయటి వ్యక్తులు అడవులను నరికి పోడు చేయకుండా చూడాలని, అడవులు అంతరించి కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. కలప అక్రమరవాణాపై గట్టి నిఘా పెట్టాలన్నారు. ఏబీఓ నుంచి ఎఫ్‌బీఓగా పదోన్నతి పొందిన కొండలింగంపర్తి బీటుకు చెందిన పి.లక్ష్మిని అభినందిస్తు సబ్‌డీఎఫ్ఓ శ్రీరామరావు శాలువాతో సత్కరించారు. అనంతరం 1965, 66, 67 సంవత్సరానికి చెందిన 59 హెక్టార్లలోని టేకు వనాలను పరిశీలించారు. రాజవొమ్మంగి అటవీక్షేత్రంలోని టేకు వనాలు సురక్షితంగా ఉన్నాయన్నారు. త్వరలో టేకు వనాల హార్వెస్టింగ్ పనులు చేపట్టనున్నామని, ఇందు కోసం ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రావాల్సి ఉందన్నారు. స్థానిక అటవీ క్షేత్రాధికారి సయ్యద్ సెహెన్‌షా ఉన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలపై 17న సమావేశం

సాక్షి,పాడేరు: పాడేరులోని మోదకొండమ్మతల్లి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఈ నెల 17న సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవ కమిటీని భక్తుల సమక్షంలో నిర్ణయిస్తామని తెలిపారు.

ఔషధ మొక్కలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు: ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక అఫ్రిన్ ఆయుర్వేద వైద్యశాలలో గురువారం ఔషధ మొక్కలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రా, ఒడిశాలకు చెందిన ఔషధ మొక్కల సాగు రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రకృతిలో ఎన్నో ఆరోగ్యకరమైన ఔషధాలు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించడం ద్వారా ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులు నయంచేసే వీలుంటుందన్నారు. అడవుల్లో సహజసిద్ధంగా లభించే చెట్ల వేర్ల నుంచి అనేక ఆయుర్వేద మందులు తయారుచేసే అవకాశముందని, కనుమరుగవుతున్న ఆయుర్వేదాన్ని కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఔషధ పంటలు పండించేందుకు రైతులు ముందుకు రావాలని తద్వారా ఎన్నో ఔషధాలు లభించే వీలుంటుందన్నా. ఈ సందర్భంగా ఆయన తన వైద్యశాల ఆవరణలో పండిస్తున్న సర్పగంధ, అశ్వగంధ, తానికాయలు, ఉసిరి, నేలతాడి వంటి ఔషధ మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు విజయ్‌కుమార్, అలోక్‌కుమార్, సుభాష్ మహంతో, ప్రణీత, దివాకర్, జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సయ్యద్ సుభానీ, ఇమ్రాన్‌ఖాన్, షాజహాన్, రాజురాణా పాల్గొన్నారు.